


నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

మంగళవారం 19 ఆగస్టు 2025 - పేజీలు 8




ధనలక్ష్మి మీ ఇంటి తలుపు తడుతోంది.. అదృష్టం ఉంటే రాత్రికి రాత్రే కోట్లకు పడగలెత్తుతారు..! అనే ఆకర్షణీయ ప్రకటనలతో ఆశల వల విసురుతారు.. కూలీలు, కార్మికులు, చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటున్నారు.. లాటరీ టికెట్ ల లక్షలు తమకే వచ్చేశాయని పించేలా భ్రమ కల్పిస్తారు.. పైగా టికెట్ ధర రూ.10 నుంచి రూ.వెయ్యి లోపు ఉండటం, గెలిస్తే దక్కే మొత్తం మాత్రం రూ.లక్షల్లో చూపడంతో అమాయకులు, యువత, కార్మికులు, కూలీలు అక్రమార్కుల బుట్టలో పడుతున్నారు.. ఇలా సామాన్యుల్లో ఆశలు రేకెత్తిస్తూ లాటరీ మాఫియా రెచ్చిపోతోంది.. రాష్ట్రం లో ఎప్పుడో నిషేధించిన లాటరీ తతంగం పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విచ్చలవిడిగా సాగుతోంది.. అమాయక ప్రజలను టార్గెట్ చేసి రెచ్చిపోతున్న మాఫియా ముఠా పట్ల పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదు.. అసలు పోలీసులు ఉన్నారని పట్టుకుంటే కేసులు నమోదు చేస్తారనే భయం లేకుండానే చీకటి వ్యాపారం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు..

- నేటిదినపత్రిక సూర్య, గుంటూరు /పల్నాడు జిల్లాబ్యూరో

# లాటరీ మాఫియా..!

- పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విచ్చలవిడిగా నిషేధిత లాటరీ ఆట
- ఆన్‌లైన్ ఆటలతో చీకటి మయం
- విచ్చలవిడిగా లాటరీ ఏజెంట్లు
- కార్మికులు, ఆటో డ్రైవర్లు, రోజువారీ కూలీలే లక్ష్యం
- ఉమ్మడి జిల్లా అంతట విస్తరించిన మాఫియా



పల్నాడు, గుంటూరు జిల్లాల్లో సామాన్యుల నుంచి సగటు కార్మికుల వరకు అంతా లాటరీ ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. రోజు వారీ సంపాదించిన డబ్బులు సరిపోక అప్పులు చేస్తున్నారు. తమ కుటుంబాలను బజారున పడేస్తున్నారు. లాటరీ పేరుతో నంబర్లు వేసిన చీటీలు విక్రయించి గంట గంటకు ఫలితాలు అంటూ ఏజెంట్లు దోచుకుంటున్నారు. ఆ మాయలో పడిపోయిన వారు కష్టపడి సంపాదించిన సొమ్మును టికెట్ల కొనుగోలుకు ఉపయోగించి నష్టపోతున్నారు. ఏజెంట్లు మాత్రం సాయంత్రానికి జేబులు నింపుకొంటున్నారు. ఈ వ్యవహారం పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కొత్తేమీ కాకపోయినా ఈ మధ్యకాలంలో అధికమైంది. కొందరు వ్యక్తులు జిల్లాల్లో ఈ లాటరీ దందా నడిపిస్తున్నారని తెలిసింది. రోజుకు కొన్ని లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయని సమాచారం. అనధికారికంగా ఇలాంటి తంతు జరుగుతుంటే పట్టించుకునే నాథుడు లేరు. మధ్యాహ్నం 12 నుంచి 6 గంటల వరకు వేర్వేరు పేర్లతో ఈ లాటరీ ఫలితాలు వస్తూ ఉంటాయి. కేవలం ఏజెంట్లు చెప్పిన నంబర్లకు మాత్రమే ప్రైజ్ తగులుతుంది. అసలు ఆ నంబర్లు ఎలా కేటాయిస్తారు..? ఎక్కడ నుంచి ఫలితాలు వస్తాయి..? అంటే కేరళ నుంచి అని ఏజెంట్లు నమ్మబలుకుతున్నారు.

**ఉదయం నుంచి 12 గంటల వరకు విక్రయం..**

ఎక్కువగా కూలీలు పనిచేసే ప్రాంతాలలో ఈ లాటరీ టికెట్ల విక్రయాలు చేపడుతున్నారు. మండలాల్లోని కొన్ని కూడళ్ళు, కొన్ని సెంటర్ లు, దేవాలయాల దగ్గరలోని రచ్చబండ్ల దగ్గర, కొన్ని బస్టాండ్ సెంటర్ లలో, సినిమా థియేటర్ సెంటర్ లలో, బేకరీ ల సమీపంలో, మార్కెట్ ల వద్ద, దర్గా సెంటర్లతో పాటుగా నగర శివార్లలో కూడా ఏజెంట్లు బైక్‌లపై వెళ్లి మహిళలతో కూడా లాటరీ చీటీలు కొనుగోలు చేయిస్తున్నట్లు "నేటిదినపత్రిక సూర్య" దృష్టికి వచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఒకరిద్దరకు తప్పితే ఇంతవరకు రూ.25 వేలు వచ్చిన వారు ఎవ్వరూ లేకపోవడం గమనార్హం. ఎక్కువ మందికి చివరి ఒక అంకె మాత్రమే కలుస్తుందని అంటున్నారు. ఇలా ప్రతిరోజూ సామాన్యుల ఆశను పెట్టుబడిగా చేసుకొని లక్షల్లో కొల్లగొడుతున్నారు లాటరీ కేటుగాళ్లు.

**అడపాదడపా దాడులే..**

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో నిత్యం కొన్ని లక్షల రూపాయల్లో లాటరీ పేరుతో దోపిడీ జరుగుతుంటే పోలీసులు కన్నెత్తిచూసిన పాపాన పోలేదు. పత్రికల్లో వస్తేనో ఎవరైనా లాటరీ గురించిన సమాచారం అందిస్తేనే పక్కాగా దాడులు చేస్తున్నారని లేదంటే అడపాదడపా దాడులతో సరిపెడుతున్నారు. జిల్లాలోని కొందరు పోలీసులు పేదల అత్యాశపై లాటరీ వల వేస్తున్న వ్యక్తులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



## నేడు, రేపు సీఎం చంద్రబాబు పర్యటన


**రేపు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం**

**గుంటూరు, మేజర్ న్యూస్**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేడు, 20వ తేదీలలో మంగళగిరిలో పర్యటించనున్నారు. నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ప్లానింగ్ శాఖ అనంత శంకర రావు, ఎండి, సీఈఓ ఏపీటీఎస్, ఏపీఐఎస్ ఏ.సూర్య తేజ , సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా సిఎంఓ కార్యాలయ అధికారి ఇక్బాల్ సాహెబ్‌తో కలసి పరిశీలించారు. తొలుత మిగతా 3వ పేజీలో

## అవినీతి కంపు..! ప్రభుత్వానికి తల వంపు..!!

- జిల్లాలో పెట్రేగిపోతున్న లంచావతారాలు
- ప్రతి శాఖలో అవినీతి కంపు
- ఫిర్యాదు చేస్తేనే ఏసీబీ దాడులు
- కాసులిస్తేనే కరుణిస్తారా? ▸ మీరు మారరా?
- తీరు మారని అధికారులతో ప్రభుత్వానికి తల వంపు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పాతుకుపోయిన అవినీతి నిర్మూలించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చిన్న పనికి వెళ్ళినా చేతులు తడపందే పనులు కావడం లేదు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల అండదండలను చూసుకొని దిగువ స్థాయి సిబ్బంది నుంచి ఆ శాఖ ఉన్నతాధికారుల వరకు జలగల్లా మారి రక్తాన్ని పిలుస్తున్నారు. పెద్ద జిల్లాలు విడిపోయి పార్లమెంటుకు ఒక జిల్లా చొప్పున మారినా అన్ని శాఖల్లో అవినీతి మాత్రం పాతదే.. ప్రతి పనికీ కమీషన్లే. కొత్త పాలనా యంత్రాంగంలో కూడా అవినీతి యథేచ్ఛగా మిగతా 3వ పేజీలో

# సెల్లారు లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా బహుళ అంతస్థు పై చర్యలు తీసుకోండి

**– నగర కమీషనరుకు స్థానికుల విజ్ఞప్తి**



**గుంటూరు ఈస్ట్, మేజర్ న్యూస్:** నిత్యం రద్దీగా ఉండే రామనామ క్షేత్రం నుంచి వైకుంఠపురం (స్మశాన వాటికకు వెళ్లే దారి లో నిబంధనలకు వ్యతిరేకంగా నాయుడు హాల్ పేరుతో బహుళ అంతస్థు నిర్మాణం చేశారు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు పెట్టుకునేందుకు సెల్లారు ఏర్పాటు చేసుకోకుండా నిర్మాణం చేయడంతో ఫంక్షన్లకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డు మీదే పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో అక్కడి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. నగర పాలక సంస్థకు చెందిన పట్టణ ప్రణాళిక అధికారులు నిర్మాణకు అనుమతులు మంజూరు చేసే అధికారులు అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడం చేసిన యజమానికి నోటీసులు జారీ చేసి పార్కింగ్ కోసం సెల్లారు ఏర్పాటు చేసుకునే విధముగా చర్యలు తీసుకోవాలని స్థానికులు నగర కమీషనర్ పులి శ్రీనివాసులని కోరుతున్నారు.

# అన్నక్యాంటీన్లకు పేద ప్రజల నుండి విశేష స్పందన



**గుంటూరు నగర పాలక సంస్థ,మేజర్ న్యూస్ :**
అన్నక్యాంటీన్లకు పేద ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని, గుంటూరు నగరంలో క్యాంటీన్‌కి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహారం అందించేందుకు అక్షయ పాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆర్టీఓ ఆఫీస్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ఏర్పాటు చేసిన 7 అన్న క్యాంటీన్లకు ప్రతి రోజు ఆహారం కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతూ ఉందన్నారు. అక్షయపాత్ర సిబ్బంది ప్రతి రోజు ఇండెంట్ రూపొందించేప్పుడు క్యాంటీన్‌కి వచ్చే వారికి ఆహారం అందలేదని ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. అలాగే జిఎంసి నుండి క్యాంటీన్ల వారీగా విధులు కేటాయించిన నోడల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మౌలిక వసతులు కల్పించాలన్నారు. క్యాంటీన్లలో శుచి, శుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున త్రాగునీటి సరఫరాలో జాగ్రత్తవహించాలన్నారు.

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :**
ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దుగ్గిరాల తాసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎం. నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వర రావు, ఎన్ యోగేశ్వరరావు, అమ్మిరెడ్డి పాల్గొనిమాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు మూడు పర్యాయాలుగా వరి ఎద పెట్టారని ఎకరానికి 15,000 వేల రూపాయల నష్టం జరిగిందని, నష్టాన్నిగుర్తించి నష్టపరిహారం వెంటనే అందివ్వాలని కోరారు. కౌ లు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు నివసించే ప్రాంతంలో ఇళ్ల పట్టాలు అందివాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోయే ముందు ప్రతి పేద కుటుంబానికి గ్రామీణ ప్రాంతంలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని వాగ్దానం చేసిందని ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు . పెద కొండూరు గ్రామంలో లంక భూములు సాగు చేస్తున్న రైతాంగానికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పనుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, ఎరువులు కొరత ఉందని ,రైతులు ఆందోళన చెందుతున్నారని ,సత్వరమే డిఏపి, యూరియా కొరతా లేకుండా సకాలంలో రైతాంగానికి ఎరువులను అందించాలని కోరారు . వితంతు పెన్షన్ ను అర్హత కలిగిన వారికి మంజూరు చేయాలన్నారు ఈ. కార్యక్రమంలో అద్దంకి పాములు, సుబ్బారావు, వెంకాయమ్మ ,పకీరమ్మ, ప్రమీల, మార్తమ్మ,శ్రీహరి ,సుబ్బారావు నీలాంబరం , తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో మెమోరాండం అందజేశారు.




# అంబేద్కర్ రాజ్యాంగానికి అవమానం..!

**– రెడ్ బుక్ రాజ్యాంగంతో అరాచకం...!!**
**– కూటమి ప్రభుత్వ విధానాలపై విద్యార్థి లోకం కన్నెర్ర**
**– వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య**
**– ప్రభుత్వ జీవోలు తగులబెట్టి నిరసన**





**గుంటూరు మేజర్ న్యూస్ :** ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మన భారతదేశం సంక్షేమం కోసం ప్రపంచంలోనే గొప్పదిగా కీర్తించబడుతున్న రాజ్యాంగాన్ని మనకు అందించారు. ఆ రాజ్యాంగం వలనే మన దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. దురదృష్టం ఏమిటంటే మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మాత్రం అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానించే రీతిలో పాలన కొనసాగిస్తుంది. విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ఏకంగా అంబేద్కర్ రాజ్యాంగం మాకు అక్కర్లేదని సొంతంగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని తయారు చేసుకుని రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారు." అని వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆరోపించారు. కూటమి ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం పాదాల చెంత విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానాలపై దుమ్మెత్తి పోశారు. కాళీ ప్లేట్లలో ప్రభుత్వ ఆర్డర్ కాపీలు పెట్టి నినాదాలతో హెూరెత్తించారు. అనంతరం జీవో కాపీలను తగులబెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని సహించేది లేదని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మీడియాతో మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగంతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే గొంతులపై కత్తి పెడుతున్నారనీ.. అక్రమ కేసులు పెడుతున్నారనీ.. అన్యాయంగా జైల్లో నిర్బంధిస్తున్నారనీ.. నిందించారు. ఆఖరికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లకు చెందిన నిరుపేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలు, విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసేంత నీచానికి దిగజారారని ధ్వజమెత్తారు. విద్యా శాఖా మంత్రిగా మీరు నిజాయితీ గల వారే అయితే ముందుగా విద్యాసంస్థలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అది మానేసి విద్యార్థి సంఘాల ప్రవేశంపై నిషేధం వంటి దుర్మార్గపూరితమైన చర్యలకు దిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థి వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకని పక్షంలో పోరుబాట పట్టాల్సి ఉంటుందని పానుగంటి చైతన్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపతి నాగరాజు, గుంటూరు నగర అధ్యక్షుడు గుడిశెట్టి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేష్, కరీం, కిరణ్, రామకృష్ణ, మస్తాన్, జిల్లా కార్యదర్శులు అరుణ్, సన్ని, వినయ్, సతీష్‌యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పేటేటి నవీన్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు సాజిద్, తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు శామ్యూల్, ప్రత్తిపాడు నియోజకవర్గం అధ్యక్షుడు కెనడి, మంగళగిరి నియోజకవర్గం అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# తెనాలి పాస్టర్ల సంక్షేమం కోసం కృషి చేస్తాం : బిషప్‌లు జాన్ పాల్, పరంజ్యోతి



**తెనాలి, మేజర్ న్యూస్ :** పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి సమావేశం స్థానిక నందులపేటలోని ఏకలవ్య విగ్రహం సమీపంలో గల బిషప్ అన్నం ఆదాం యొక్క ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. సోమవారం నిర్వహించిన సమావేశానికి అసోసియేషన్ ప్రతినిధి బిషప్ ఆదాం అధ్యక్షత వహించగా అసోసియేషన్ కోశాధికారి విలియం కేరి సభను ముందుకు నడిపించారు. సమావేశానికి అసోసియేషన్ వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్, అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పాముల పరంజ్యోతి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుమారు 100 మంది తెనాలి పట్టణ పాస్టర్లు హాజరైన సమావేశంలో అతిధులు మాట్లాడుతూ పాస్టర్ల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా అసోసియేషన్ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. అసోసియేషన్ సమావేశ నిర్వహణ కార్యవర్గ సభ్యుల సహకారంతో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రానున్న కాలంలో అసోసియేషన్ ద్వారా పాస్టర్లకు గొప్ప సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. దైవ సేవకుల అవసరతల కొరకు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పాముల పరంజ్యోతి సమయపాలన తద్వారా జరిగే సంఘం కూర్పు, దేవుడు చేసే గొప్ప కార్యాలను వాక్యోపదేశం చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు బిషప్ గడ్డం సాధుతామస్ జూనియర్ మాట్లాడుతూ వచ్చేనెల 30వ తేదీన అసోసియేషన్ మాస సమావేశం ఐతానగర్ లోని గడ్డం థామస్ ప్రాంగణంలో జరుగుతుందని అసోసియేషన్ కార్యవర్గం, సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు. సమావేశాన్ని అసోసియేషన్ కార్యదర్శి రెవరెండ్ సువర్ణ రాజు, సహాయ కార్యదర్శులు రావూరి విక్టర్ పాల్, మల్లవరపు విజయ్ కుమారులు పర్యవేక్షించారు. దేవుని స్తుతి, వాక్య పరిచర్య నడుమ సాగిన సమావేశంలో పాస్టర్లకు ప్రేమ విందు అందించి, చిరు కానుకలను సమర్పించారు. బిషప్ అన్నం ఆదం వీరి కుమారులు అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జాన్ పాల్, అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు బిషప్ పరంజ్యోతి, బిషప్ సాధుతామస్ జూనియర్ లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గడ్డం జాన్ బాబు, రజినీ కాంత్, షద్రక్, పట్టణంలోని పాస్టర్లు హాజరయ్యారు.

# ఆధునిక సౌకర్యాలతో సిజిహెచ్ఎస్ ను మరింత అభివృద్ధి చేస్తాం

**– చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి. సిహెచ్. కోటేశ్వరరావు**



**గుంటూరు, రూరల్ , మేజర్ న్యూస్ :**
మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య సదుపాయాలతో సిజిహెచ్ఎస్ ( సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ ) వెల్‌నెస్ సెంటర్ ను మరింతగా అభివృద్ధి చేస్తామని సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. సిహెచ్. కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం నగరంపాలెం లోని సిజిహెచ్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన లాబొరేటరీ మరియు ఇంజెక్షన్, బి.పి పరీక్షా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిజిహెచ్ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి. హేమా సుందరి అధ్యక్షత వహించారు. సి.ఎం.ఓ డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ..కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా, సిజిహెచ్ఎస్ ఆరోగ్య కేంద్రాలను, కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరింత మెరుగైన స్థితికి తీసుకువస్తామన్నారు. క్రమంగా పురోగతి సాధించటానికి మరిన్ని నూతన వైద్య పరికరాలు సమకూర్చుకొని, ఉద్యోగులు, పెన్షనర్ల వైద్య సంరక్షణకు మరింతగా కృషి చేస్తామన్నారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య మాట్లాడుతూ.. నూతన ప్రారంభోత్సవాల ద్వారా మరిన్ని వైద్య సౌకర్యాలకు అంకురార్పణ జరిగిందన్నారు. ప్రతి పేషంట్ ఆరోగ్య సంక్షేమమే తమ లక్ష్యమన్నారు.
సిజిహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి మాట్లాడుతూ.. సిజిహెచ్ఎస్ లో ఎప్పుడూ లేని విధంగా మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల లో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిజిహెచ్ఎస్ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి. హేమా సుందరి, ఫార్మాసిస్టు అయోషా బేగం, సునీల్, లాబొరేటరీ అసిస్టెంట్లు మురళీ, రామారావు, సిబ్బంది మోహన్, మక్బూల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి తో పాటు పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# అవినీతి కంపు..! ప్రభుత్వానికి తలవంపు..!!

(మొదటి పేజీ తరువాయి)

సాగుతోంది. అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఇదే తీరు నడుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు వస్తేనే ఏసీబీ స్పందిస్తోందని, లేకపోతే పట్టించుకోవడం లేదనే వాదన కూడా ఉంది. ఈ అవినీతికి అంతేమైనా ఉందా? అనే చర్చ సాగుతోంది. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తేనే ఏసీబీ అధికారులు దాడి చేసే పరిస్థితికి వచ్చారు. అనేక ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు పెద్ద ఎత్తున లంచాలకు పాల్పడుతూ ఆ శాఖ ప్రతిష్టకు తీరని మచ్చ తెస్తున్నారు .ఎక్కడైనా ఏసీబీ అధికారుల వలకు చిక్కితే శిక్ష పడకుండా తప్పించుకుంటున్నారు. దీనికి కారణం చట్టంలో ఉన్న లోపాలే. ఒక అధికారి ఎన్నిసార్లు ఏసీబీకి చిక్కనా ఆ ఉచ్చు నుంచి బయట పడ్డాక మళ్లీ అదే శాఖ లో పదోన్నతులు పొంది దర్జాగా కొనసాగుతున్నారు. దీంతో అవినీతి నిరోధక శాఖ పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. గత పదేళ్ల నుంచి పరిశీలిస్తే ఏసీబీకి చిక్కిన ఎంత మంది అధికారులకు, సిబ్బందికి శిక్షణ పడ్డాయో వారికే తెలియాలి. ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ సిబ్బంది కేసు నుంచి బయటపడడానికి బాధితులతో సాక్షులతో, రాజీ పడుతున్నారు. దీనికి కొంతమంది ఉన్నతాధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ.కార్యాలయాల్లో పట్టాదారు పాసు పుస్తకాల కోసం కాళ్ల చెప్పులు అరిగేలా తిరుగుతున్న రైతులు ఎంతో మంది ఉన్నారు. పైసలిస్తేనే పాస్ పుస్తకం ఇస్తామంటూ విఆర్ఓ మొదలు రెవెన్యూ అధికారి వరకు బేరాలు పెట్టి లంచాల కోసం చేతులు చాస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రైతులు ఫిర్యాదు చేసినా వారికి రెవెన్యూ కార్యాలయాల్లో కాకుండా వీఆర్వోలు అడ్డుపడుతున్నారు. అన్ని జిల్లాలో లక్షలాది వందలాది మంది రైతులు పాసుపుస్తకాలకు దరఖాస్తు చేసుకుని వాటి కోసం ఎదురు డబ్బులు ఇస్తే పాస్ పుస్తకం ఇస్తున్నారు లేదంటే రోజుల తరబడి వీఆర్వోలు, సిబ్బంది, రెవెన్యూ కార్యాలయం అధికారులు తమ చుట్టూ రెవెన్యూ కార్యలయాలు, సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది తనిఖీ చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా అనేక పాస్ పుస్తకాలు బయటపడతాయని కొంతమంది రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా తమకు పాసు పుస్తకాలు ఇవ్వడం లేదని, మ్యూటేషన్ జరగడం లేదని రైతులు ఏసీబీ అధికారులకు గతంలోఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇంతవరకు అవి కోటని ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు భూములు రీ సర్వే గ్రామాల్లో. రాజముద్రతో పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలోని పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి ఎక్కువగా జరుగుతోందని, డాక్యుమెంటు రైటర్లు అధికారులకు ముడుపులు ముట్టచెప్పున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఏసీబీ అధికారులు దాడులు చేయాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉండగా ప్రజలు ఫిర్యాదు చేస్తేనే ఏసీబీ దాడులు చేస్తుందని, లేకపోతే అంతా సవ్యంగా ఉన్నట్లు ఏసీబీ అధికారులు భావిస్తున్నారని అనుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వెళ్లినపుడు అ?ధికారుల తీరుతో విసుగు చెందిన వారు ఫిర్యాదు చేస్తేనే ఏసీబీలో కదలిక వస్తోం ది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న చిన్నాచితక సిబ్బందిపై ఏసీబీ దాడులు జరుగుతున్నాయి పెద్ద చేపల పై వల వేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి ప్రజలు ఎవరైనా అవినీతిపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తేనే తప్ప సొంతగా దాడులు చేసిన సందర్భాలు లేవు. ఒకవేళ ఎవరైనా అవినీతి పై ఫిర్యాదు చేస్తే తే గోప్యంగా ఉంచాల్సిన



ఏసీబీ కార్యాలయ సిబ్బంది ముందుగానే లీకులు ఇస్తున్నారని పలువురు చెబుతున్నారు.. అలాగని అవినీతి ఏమైనా తగ్గిందా? అంటే అదీ లేదు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఎంత తీవ్రంగా ఉన్నదో ఫిర్యాదులే చెబు తున్నాయి.

**దాడులు చేస్తేనే..**

మండలానికో ఏసీబీ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తామని, ఫిర్యాదులకు దిశ యాప్ అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అవినీతి అంతం చేస్తామంటూ చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. బీరాలు పలుకుతోంది. అవినీతి లేని పాలన అందిస్తామని ప్రకటించారు. అవినీతిని నిర్మూలిస్తే అంతకంటే ఏం కావాలి? కానీ ఏసీబీకి అవినీతిపరుల చిట్టా తెలియదా? ఏ ఏ శాఖల్లో ఏ అధికారులు లంచాలు దిగమింగుతున్నారో సమాచారం లేదా? అసలు ఆ శాఖలపై నిఘా ఉందా? లంచాలు తీసుకునే వారికి భయం కలిగేలా ఏమైనా చేస్తున్నారా? అంటే సమాధానం లేదు. ఏసీబీ అధికారులు మాత్రం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఫిర్యాదు చేయడానికి నంబరు కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని, ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వెంటనే దాడులు చేస్తున్నామని చెబుతున్నారు. ఇంత చేసి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తప్ప పట్టించుకోకపోతే ఏం లాభం అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**పని జరగాలంటే...,**

రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా చేతి చమురు వదలకుండా పని జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరికి ముట్ట జెప్పాల్సింది వారికి ఇవ్వకపోతే పని కావడం లేదని అంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో ఈ తీరు ఎక్కువ. చిన్న పని దగ్గరి నుంచి పట్టాదారు పాసు పుస్తకాల వరకు ప్రతి దానికి ఓ రేటు. అది ఇవ్వకోపోతే సంవత్సరాలు గడిచినా పని జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. కింది నుంచి పై దాకా ప్రతి ఒక్కరి చేయి తడపాల్సిందే. వ్యవసాయ భూముల పాసు పుస్తకాలకు ఎకరానికి ఇంత అని లెక్కగట్టి తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో కొన్ని చోట్ల ఏసీబీ అధికారులు దాడులు చేసినపుడు మాత్రమే తూ తూ మంత్రంగా చేయి తడపడం ఆపుతున్నారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల. అనేక తహసీల్దార్ కార్యాలయాల్లో పంపిణీ కాని పాసు పుస్తకాలను గుర్తించినట్లు తెలుస్తోంది.. దీనిని బట్టి ఈ శాఖలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. డబ్బులు ఇస్తేనే పాసు పుస్తకాలు ఇస్తున్నారని, డబ్బు ఇచ్చుకోలేని వారి పాసు పుస్తకాలు కార్యాలయాల్లో మగ్గిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. పాఠశాల పిల్లలకు అవసరమయ్యే సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్లు.. ఇలా అన్నింటికీ కొంత మంది మండల రెవెన్యూ అధికారులు ధర ఇంత అని నిర్ణయించి లంచం తీసుకుం టున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

**పర్సంటేజీ ప్రకారం..**

ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా ల్లో అవినీతికి అంతే లేదు. ఏదైనా అస్తికి సంబంధించిన క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చేస్తే దానికి విలువలో ఇంత శాతం అంటూ తీసుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. రూ. పది లక్షల విలువ చేసే భూమి కొంటే కనీసం పదివేల రూపాయల సమర్పించుకోవాల్సిందే! ఈ వ్యవహారం డాక్యుమెంటు రైటర్ల చేతుల మీదుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వినియోగదారుల నుంచి వీరు తీసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది అందజేస్తారు. దానిని సిబ్బంది అంతా పంచుకుం టున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారం చూసుకు నేందుకు రిజిస్ట్రేషన్ సిబ్బంది ప్రత్యేకంగా ఓ మనిషిని నియమిం చుకుంటున్నారన్న అరోపణలు కూడా ఉన్నాయి. జిల్లాలో కొంతమంది సబ్ రిజిస్ట్రార్ల తీరును గమనించి ఆ శాఖ ఉన్నతాధికారులు సంవత్సర కాలంలో పలువురిని బదిలీ కూడా చేశారంటే ఈ శాఖలో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లేందుకు అనేకమంది రిజిస్ట్రార్లు పోటీ పడుతున్నారు. ఇందుకోసం ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున లంచాలు బుట్ట చెబుతున్నారు.

**సామాన్యుడికి వణుకే..**

న్యాయం కోసం పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కితే రక్షణ అటుంచి పోలీసుల తీరుతో సామాన్యులు వణికిపోతున్నారు. తమకు న్యాయం జరగడం లేదని పలువురు బాధితులు స్పందన కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్న దాఖలాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పలువురు బాధితులు చుట్టూ తిరిగి పనులు కాకపోవడంతో తరచూ అక్కడక్కడ ఆత్మహత్యాయత్నం చేస్తున్నారంటే పోలీసులు సామాన్యుల పట్ల ఏ విధంగా ప్రవర్తి స్తున్నారో తెలుస్తోంది. ఫిర్యాదును స్వీకరించేందుకు కూడా లంచాలు అడుగుతున్నారని అన్ని జిల్లాల నుంచి ఆరోపణలు వినిపి స్తున్నాయి. ఫిర్యాదు నమోదు చేయకుండా ఉండేందుకు కూడా అరోప ణలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్థాయిని బట్టి లంచం వసూలు చేస్తు న్నారనే విమర్శలు ఉన్నాయి.

**ప్రతి శాఖలో ఇదే తీరు..**

అవినీతి ఏ ఒక్క శాఖకో పరిమితమైందనుకుంటే పొరబాటే. ఆదాయం ఎక్కువ ఉన్న ప్రతి శాఖలో డబ్బులు దండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. జనావాసాలు పెరుగుతుండటంతో ప్రతి చోట లే అవుట్లు వెలుస్తున్నాయి. వీటి అనుమతి పనులను ప్లానింగ్ విభాగం చూస్తుంది. లే అవుట్ విస్తీర్ణం చూసి, ఎకరాల చొప్పున ఇంత అని తీసుకుంటారు. పొలాలను సర్వే చేసే సర్వేయర్లది మరో లెక్క. డబ్బులను బట్టి సరిహద్దులు మారిపోతుంటాయి. వీరి తీరుతో సరిహద్దు వివాదాల్లో రెండు వర్గాల వారు సతమతమైన సందర్భాలు ఇలాంటి వ్యవహారాలు అనేకం ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రాంతంలో చూసినా మునుపెన్నడూ లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. పంచాయతీ కార్యదర్శి నుంచి భూమి కన్వర్షన్ చేసే రెవెన్యూ అధికారుల వరకూ పెద్ద ఎత్తున లంచాలు గుంజుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమంగా ప్లాట్లు వేసిన వారి పై చర్యలు లేవు. ఆరోపణలు వచ్చిన చోట తనిఖీలు కూడా లేవు. జిల్లా నలుమూలల అక్రమ ప్లాట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్ననాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంతమంది బ్రోకర్లు రాజకీయ నాయకుల కనుసన్నల్లో పనిచేస్తూ తూ అక్రమ పద్ధతిలో రియల్ వ్యాపారానికి ద్వారాలు తీస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇక రవాణా శాఖలో దళారులు లేకుండా పని జరగడం దాదాపు అసాధ్యమే! ఇవన్నీ అందరికీ తెలిసి జరుగుతున్న వ్యవహారాలే! ఇలాంటి అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపించాలని ప్రజానీకం కోరుతోంది. ఎక్కువ లంచాలు గుంజుతున్న ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించి ఏసీబీ అధికారులు తనిఖీలు చేయాలి. అంతేకాకుండా అధికారుల ఆస్తిపాస్తులు పై కూడా సుమోటోగా స్వీకరించి దాడులు చేసి అవినీతిని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

## నేడు, రేపు సీఎం చంద్రబాబు పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

19వ తేదీ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో జరిగే జీరో ప్రావర్టీ పీ4 కార్యక్రమంలో పాల్గొనే ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సీటింగ్ ఏర్పాట్లు, సభాస్థలి ఏర్పాట్లు, పీఏ సిస్టమ్ ఏర్పాట్లు , మీడియా గ్యాలరీ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఈ నెల 20 వ తేది మంగళగిరి ఎన్ ఆర్ ఐ పై ఓవర్ వద్ద మయూరి టెక్ పార్క్ లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్న దృష్ట్యా అక్కడి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిఅధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో యంటీయంసీ కమిషనర్ అలీం బాషా, ఆర్ డి ఓ కే. శ్రీనివాస రావు, సిపిఓ శేషశ్రీ, డి ఎస్ ఓ చంద్రముని, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మీ, డీడీ ఎన్ ఐ సీ బిమల్ కుమార్, డీటీసీ కే.సీతారామిరెడ్డి, గ్రామ / వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ మోహన్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కృష్ణా రెడ్డి, డీఎస్పీలు మురళి కృష్ణ, రవి కుమార్, మంగళగిరి తహసిల్దార్ కే. దినేష్ రాఘవ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 198 అర్జీలు**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, డ్వామా పిడి శంకర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్ లో వ్యక్తిగత, సామాజిక అంశాలకు సంబంధించి ప్రజలు 198 అర్జీలను అందించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో అందించిన ఫిర్యాదులను విత్ ఇన్ ఎస్ ఎల్ లో ఖచ్చితంగా పరిష్కరించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రీ ఓపెన్ క్యాటగిరి లోని అర్జీలను జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తక్షణమే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో దరఖాస్తుదారుల సంతృప్తి స్థాయి మరింత మెరుగుపడేలా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ ను ఈపీటీఎస్ లో అప్లోడ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు, జిల్లా కార్యాలయాల్లో ప్రతిరోజు 1000 ఫైల్స్ ను, ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో 500 ఫైల్స్ ను ఈపిటిఎస్ లో కచ్చితంగా అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం కారుణ్య నియామకాల ద్వారా జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ శాఖలో 8 మందికి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ లీగల్ మెట్రాలజీలో ఒకరికి జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక ఉత్తర్వులను జిల్లా రెవిన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర బాబు, డీడీ పశు సంవర్ధక శాఖ డా.కేవివి. సత్యనారాయణ, గ్రామ / వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ మోహన్ , ఐసీడీఎస్ పీడీ ప్రసూన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని విజయలక్ష్మి, మార్కెట్ డిఎం నరసింహారెడ్డి తదితరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ తప్పుడు ప్రచారం

**ఏపిఐడిసి చైర్మన్ దేగల ప్రభాకర్ విమర్శ**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి వంటి పథకాలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన చూసి తాడేపల్లి ప్యాలెస్ లో జగన్ రెడ్డి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. సోమవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో చైర్మన్ ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు .మద్యం కుంభకోణంలో జగన్ పాత్రపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్ళించేందుకు తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆగస్టు 11 నుంచి వారం రోజులపాటు భారీ వర్షాలు కురుస్తున్నాయి. సుమారు 16 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. రికార్డు స్థాయిలో సి ఆర్ డి ఏపరిసర ప్రాంతాల్లో వర్షపాతం నమోదైనప్పటికీ ఎక్కడా ఏ కార్యాలయమైనా మునిగిపోయిందా? అని ప్రశ్నించారు.

# శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### – అధికారులను ఆదేశించిన కమిషనర్ శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి సరఫరా, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.



ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్లు, త్రాగునీటి కుళాయి కనెక్షన్ల వంటి మౌలిక వసతుల కల్పనకు ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. నూతనంగా నిర్మాణం చేసే డ్రైన్లు తప్పనిసరిగా లెవల్స్ ఉండేలా, నాణ్యత పాటించేలా పర్యవేక్షణ చేయాలని, తమ పరిశీలనలో లోపాలు గుర్తిస్తే సంబందిత అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు. ప్రస్తుతం కృష్ణా నదికి వరద నీరు వస్తున్నందున నగరంలో ప్రజలు త్రాగు నీటిని కాచి చల్లార్జి వాడుకోవాలని తెలియచేస్తూ, ప్రతి సచివాలయం పరిధిలో శ్యాంపిల్స్ తీయాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్ చుట్టుపక్కల నివాసాలు పెరుగుతున్నందున ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి నివాసితులకు దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తెస్తున్నారని, సదరు ఖాళీ స్థల యజమానులచే స్థలాన్ని శుభ్రం చేసుకునేలా తెలియచేయాలని, స్పందించని వాటికి జిఎంసి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం రవీంద్ర నగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, నిబందనల మేరకు నిర్మాణాలు జరిగేలా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు పర్యవేక్షణ చేయాలని, అనధికార, అక్రమ నిర్మాణాలను తొలి దశలోనే అడ్డుకోవాలన్నారు. పర్యటనలో డిఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెనాలిలో గంజాయి ముఠా అరెస్ట్

### – వేర్వేరు కేసుల్లో 15 మంది అరెస్ట్

**తెనాలి, మేజర్ న్యూస్:** గంజాయిని విక్రయిస్తూ, సేవిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జనార్ధన రావు నిందితుల వివరాలు వెల్లడించారు. వేరువేరుగా రెండు గంజాయి విక్రయ కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. తెనాలి త్రీటౌన్ పరిధిలోని సుల్తానాబాద్ శివారు ఖాళీ ప్రదేశంలో గంజాయి సేవించడంతో పాటు చిన్న పొట్లలుగా చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచినట్లు అందిన సమాచారం మేరకు సీఐ సురేష్ బాబు ఆకస్మిక దాడులు నిర్వహించగా 8 మంది పట్టుబడ్డారు. ఒకరు పరారీ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మృత్యుంజయ కుమార్ బీహార్ నుండి గంజాయి తెచ్చి తెనాలిలో యువతకు వికరయాలు చేస్తున్నట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 1.75 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇటీవల డ్రోన్ల ద్వారా గంజాయి ముఠాపై పోలీసులు నిఘా పెట్టగా వీరిని గుర్తించినట్లు తెలుస్తోంది. వీరు గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఖాళీ ప్రదేశం చెట్ల కొమ్మలతో నిండిపోయి ఉండటంతో పోలీసులు ప్రోక్లైన్ ద్వారా ఆ ప్రదేశాన్ని చదును చేయించారు. కొల్లిపర మండలంలో గంజాయిని విక్రయిస్తూ, సేవిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి జనార్ధన రావు తెలియచేశారు. గంజాయి విక్రయాలను ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నా పక్క రాష్ట్రాల నుండి అడ్డదారుల్లో గంజాయిని తీసుకు



వచ్చి విక్రయిస్తున్నారని చెప్పారు. ఇటువంటి వారిపై ప్రత్యేక పోలీస్ బృందాన్ని నిఘా పెట్టడం జరిగిందని చెప్పారు. గంజాయి విక్రయాలు అలాగే దాన్ని సేవించటం లాంటివి పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మూడుకు మించి గంజాయి కేసులు ఉన్న వారిపై పిడి యాక్ట్, సస్పెక్ట్ షీట్లను తెరుస్తామని డిఎస్పి జనార్ధన రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులని, సిబ్బందిని, కొల్లిపర పోలీస్ స్టేషన్ అధికారులను, సిబ్బందిని డిఎస్పి జనార్ధన రావు అభినందించారు. సమావేశంలో త్రీ టౌన్ సీఐ సురేష్ బాబు, రూరల్ సీఐ ఉమేష్, ఎస్ ఐ లు, సిబ్బంది ఉన్నారు.

# ఆశ్రమ నిర్వహణకు రూ.1 లక్ష విరాళం



**తెనాలి, మేజర్ న్యూస్ :**

వృద్ధాశ్రమం నిర్వహణకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోకి ఆశ్రమ నిర్వహణకు పెదరావూరు గ్రామానికి చెందిన షేక్ భాషా సోమవారం రూ. 1 లక్ష చెక్కును సోమవారం వజ్రాల కు అందించారు. ఈ సందర్భంగా రామలింగాచారి మాట్లాడుతూ భాషా తన తండ్రి షేక్ హనీఫ్ జ్ఞాపకార్థం ఆశ్రమానికి విరాళం అందించినట్లు చెప్పారు. విశ్వశాంతి కోసం ప్రతి ఒక్కరు తమ వంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించి ఆశ్రమంలోని వృద్ధులకు సేవలు నిరాటంకంగా అందించేందుకు తోడ్పడాలని కోరారు. ఆశ్రమ నిర్వహణకు విరాళం అందించిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు. షేక్ జాన్ సైదా, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ పేరిట అమరావతి రాజధాని రైతులు మళ్ళీమళ్ళి నష్టపోవడం సిద్ధంగా లేరు

### – జె.కె.ఆర్. ఆధ్వర్యంలో 50 వ రోజుకు చేరిన రిలే నిరసన దీక్ష

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** భూ సేకరణ పేరిట పేదలను అమరావతి రాజధాని రైతులను నమ్మించి, మభ్యపెట్టి లేనిపోని ఆశలు కల్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేయాలని చూస్తున్నారని, అప్పనంగా రైతుల భూములు ఆక్రమించి ఆన్లైన్లో రియల్ ఎస్టేట్ పేరిట వ్యాపారం చేయడం సమంజసం కాదని ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు ఆరోపించారు. ల్యాండ్ పోలింగ్ పేరిట వారు ఇచ్చే ఎకరం భూమిలోనే పావు ఎకరం (25 సెంట్లు) భూమి అభివృద్ధి చేసి రిటర్న్ ఇస్తానని పదేళ్ల క్రితం తీసుకున్న భూములు నేటికీ అభివృద్ధి చేయకపోవడం ఆయన మోస పూర్తి విధానాలకు నిదర్శమని జంజనం కోటేశ్వరరావు విమర్శించారు. భూ సేకరణ కోసం రైతుల అందజేసిన భూమిలో రైతులకు కేటాయించిన 25 సెంట్లు మినహాయించి మిగిలిన 75 సెంట్లు భూమిని ప్రభుత్వం పేరట చేజిక్కించుకొని అభివృద్ధి పేరిట పలు వ్యాపార సంస్థలకు కట్టబెట్టిన నేటికీ అనుకున్న లక్ష్యాలు నెరవే నెరవేరాలేదని, ఇప్పటికైనా సీఎం చంద్రబాబు నాయుడు మోసపూరిత వాగ్దానాలు కట్టబెట్టి మొదటి విడతలో ల్యాండ్ పోలింగ్ పేరిట తీసుకున్న భూములను వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. రెండో విడత పులింగ్ పేరిట రైతుల వద్దద నుండి భూములు తీసుకోవాలనే ఆలోచనలను నిర్మించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి విజ్ఞప్తి చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పులింగ్ పేరిట రైతుల భూములు కోల్పోవడానికి సద్ధంగా లేరని ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు స్పష్టం చేశారు. అమ



రావతి రాజధాని బిడ్డగా ప్రభుత్వ మోసాలను వ్యతిరేకిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ల్యాండ్ పూలింగ్ విధానాలను వ్యతిరేకంగా తాడికొండ మండలం లోని నిడుముక్కల గ్రామంలో ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలు 50వ రోజుకు చేరుకున్నట్లుగా ఆయన తెలిపారు. రైతులకు తగిన న్యాయం చేసే వరకు నా రిలే నిరసన దీక్ష కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న రైతులు ఆయనకు మద్దతు తెలిపారు.

# ర్యాలీకి తరలివచ్చిన రైతులకు ధన్యవాదాలు : ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల మేజర్ న్యూస్ :**

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీకి పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతు సోదర్లకు మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఈ నెల 17, ఆదివారం మాచర్ల పట్టణంలో రైతులతో నిర్వహించిన ట్రాక్టర్స్ ర్యాలీలో దాదాపు 500 ట్రాక్టర్లతో రైతులు పోటెత్తారని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వ హయంలో రైతు సంక్షేమానికి పెద్దపీఠ వేస్తూ, వారికి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. అదే నమ్మకం, విశ్వాసంతోనే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో రైతులు చురుగ్గా పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ర్యాలీని పెద్దఎత్తున విజయవంతం చేసిన రైతులకు, మహిళా రైతులకు, కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలిపారు.



# మాచర్ల ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కోరుతూ ఎమ్మార్వోకి వినతి



**మాచర్ల మేజర్ న్యూస్ :**

మాచర్ల పట్టణంలో ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కేటాయింపు కొరకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఈరోజు మాచర్ల మండల తహశీల్దార్ బందెల కిరణ్ కుమార్‌కు ఏపీయూడబ్ల్యూజే యూనియన్ తరఫున గ్రీవెన్స్‌లో అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రెస్ క్లబ్ భవన ఆవశ్యకత, పడుతున్న ఇబ్బందులు గురించి తహశీల్దార్ కు వివరించారు. ఈ విషయంపై తహశీల్దార్ కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజెయు సభ్యులు గాడిపర్తి శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి, జిల్లా సహాయ కార్యదర్శి మాగులూరి రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు పఠాన్ జాన్ ఖాన్, పులుసు శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ దాసరి రాధాకృష్ణమూర్తి, నంద్యాల చెన్నారెడ్డి, కోవూరి శ్రీనివాసరావు, షేక్ సుభాని తదితరులున్నారు.

# రాజధాని అమరావతిలో మూడు రిజర్వాయర్ల నిర్మాణం

### – వరదకు అడ్డుకట్ట!

**గుంటూరు, మేజర్ న్యూస్ :**

భారీ వర్షాలకు ఏపీ రాజధాని అమరావతి ప్రాంతం జలమయం కావడం ప్రధాన సమస్యగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారం కోసం నీరుకొండ (0.4 టీఎంసీ), కృష్ణాయపాలెం (0.1 టీఎంసీ), శాఖమూరు (0.01 టీఎంసీ)లతో మూడు రిజర్వాయర్లను రూ. 1200–1500 కోట్లతో నిర్మిస్తున్నారు.

8 కి.మీ. గ్రావిటీ కెనాల్తో పాటు 48.3 కి.మీ. కాలువల వెడల్పు, పూడికతీత పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే అమరావతిలో నీరు నిలబడదని అధికారులు చెబుతున్నారు.

# లోక్ సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశం

**గుంటూరు, మేజర్ న్యూస్ :**

ఢిల్లీలో లోక్ సభ సబార్డినేట్ లెజిశ్లేషన్ కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన సోమవారం కేంద్ర పర్యావరణం, అటవీవాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో సెక్రటరీ తన్మయ్ కుమార్, , సురేష్ కుమార్ అవస్తి, అడిషనల్ సెక్రటరీలు నరేష్ పాల్ గాంగవర్, వీర్ విక్రమ్ యాదవ్, ఆనంద్ మెహన్, జాయింట్ సెక్రటరీలు సమ్మెట ప్రసాద్, రజిత అగర్వాల్, వేద ప్రకాష్ మిశ్రా, నీలేష్ కుమార్ షా, సత్యజిత్ మిశ్రా , అడిషనల్ డైరెక్టర్ మిస్ రుచిక ఋషి తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వం సత్వరమే రైతులను ఆదుకోవాలి

**తెనాలి, మేజర్ న్యూస్ :** భారీ వర్షాలు వరదలు కారణంగా నష్టపోయిన పంట పొలాలను సత్వరమే నష్టపరిహారం అంచనావేసి ఎకరానికి రూ. 10 వేలు పరిహారం, విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలని కోరుతూ సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ గత ఏడాదిమాదిరిగానే ఈ ఏడాది కూడా రైతులు అధిక వర్షాలు వరదలు వలన నష్టపోవటం జరిగిందని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికే రైతులు కౌలు రైతులు రెండు మూడు పర్యాయములు ఎదబెట్టి ఎకరానికి రూ. 15 వేలు నష్టపోయారని తెలిపారు. కొలకలూరు, హాఫ్ పేట, సెలపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు తమ ఎరువులను పంట పొలాల వద్ద నిలువ చేసుకుని వర్షాలకు తడిసి పనికి రాకుండా పోవటం వలన మరో రూ. 15 వేలు నష్టం వాటిలినట్లు ఆయన వివరించారు. నూటికి 70, 80 శాతంగా ఉన్న కౌలు రైతులకు దేవాలయ భూములు సాగు చేసుకుంటున్నా సాగుదారులకు ప్రభుత్వం వాగ్దానం చేసిన మేరకు గుర్తింపు కార్డులు బ్యాంకు రుణాలు అన్నదాత సుఖీభవ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వరదల వలన తెగిపోయిన గండ్లు పడిన పంట కాలువలు మరమ్మత్తులు పూర్తిస్థాయిలో చేయాలని గుర్రపు డెక్కకు తూటాకు తొలగించాలని కోరారు. మూడు నియోజకవర్గాలు ఐదు మండలాలు సంబంధించి 26 వేల గ్రామాలకు నీరు అందించే పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ ద్వారా సాగునీరు అందించాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు చేసిన వాగ్దానం మేరకు శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని



బాధిత పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి పరిహారం ఇప్పించాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ వర్షాలు పడక కొన్నాళ్లు అధిక వర్షాలు వరదలతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ సిఐటియు డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, రైతులు తమ్మ శివరాం, రవికిషోర్, కళ్ళం శ్రీనివాసరెడ్డి, కే రవి, గుంపెన రత్తయ్య, కప్పల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## స్థలం ఆక్రమించారు - న్యాయం చేయండి

**తెనాలి, మేజర్ న్యూస్ :**



తమ స్థలం ఆక్రమించి, దౌర్జన్యంగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్లెపాడు గ్రామానికి చెందిన పినరాయి సునీల్ డీఎస్పీ బి జనార్ధనరావు పిర్యాదు చేశారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డీఎస్పీకి పిర్యాదు చేశారు. మల్లెపాడు గ్రామంలో డీ నెం 198-1 లో 25 సెంట్ల స్థలంలో అదే గ్రామానికి చెందిన పినపాటి నాగేశ్వర రావు, పినరాయి కోటేశ్వరరావులు ఆక్రమించి అక్రమ కట్టడం చేపట్టినట్లు చెప్పారు. తమ స్థలంలో ఎందుకు నిర్మాణాలు చేపట్టారని ప్రశ్నించిన తనపై ఐతానగర్ కు చెందిన కొంత మంది మందులను పిలిపించి తనపై దాడికి ప్రయత్నించినట్లు చెప్పారు. సదరు స్థలం తమకు చెందినదిగా తన వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. వారి వద్ద ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినా దౌర్జన్యంగా ఆక్రమించారని చెప్పారు. ఈ విషయంపై తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేసిన తనకు న్యాయం జరగలేదని చెప్పారు. తమ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డీఎస్పీని కోరారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :**

నగరంలోని పాత మంగళగిరి గౌడ కమ్యూనిటీ హాల్ లో నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కల్లు గీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయ ప్రకాష్ నారాయణ, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు వాకా రాంగోపాల్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలు రాజులపాటి కళ్యాణి, రాష్ట్ర తెలుగు నాడు గీత కార్మిక సంఘం అధ్యక్షులు రేఖా సుధాకర్ గౌడ్ హాజరయ్యారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి అతిథులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కల్లు గీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ మాట్లాడారు. గోల్కొండ ఖిల్లా జయించిన మహారాజ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన అన్నారు. కులవృత్తి కల్లు గీత చేపట్టి ఆనాడు గోల్కొండ నవాబుల హింసాత్మక చర్యల నుండి ప్రజలను కాపాడారన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ చేసిన సేవలు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోని యువకులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పలగాని శ్రీనివాస్, తాతారావు, వేముల వెంకటాచలం, శివప్రసాద్, తాతా కోటయ్య, సాంబశివరావు, పామర్తి సాంబశివరావు, జూపల్లి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ సదాశివరావు, పందేటి తిరుపతయ్య, గోవాడ దుర్గారావు, నక్క బాలకోటి, మున్నంగి శివ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**మేజర్ న్యూస్ వినుకొండ:**

వినుకొండ పట్టణం కే ఎస్ ఫంక్షన్ హాల్ నందు గోనుగుంట్ల వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సెల్లారు లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన బహుళ అంతస్థు పై చర్యలు తీసుకోండి

**– నగర కమీషనరుకు స్థానికుల విజ్ఞప్తి**



**గుంటూరు ఈస్ట్, మేజర్ న్యూ:** నిత్యం రద్దీగా ఉండే రామనామ క్షేత్రం నుంచి వైకుంఠపురం (స్మశాన వాటికకు వెళ్లే దారిలో నిబంధనలకు వ్యతిరేకంగా నాయుడు హాల్ పేరుతో బహుళ అంతస్థు నిర్మాణం చేశారు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు పెట్టుకునేందుకు సెల్లారు ఏర్పాటు చేసుకోకుండా నిర్మాణం చేయడంతో ఫంక్షన్లకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డు మీదే పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో అక్కడి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురిఅవుతున్నారు. నగర పాలక సంస్థకు చెందిన పట్టణ ప్రణాళిక అధికారులు నిర్మాణకు అనుమతులు మంజూరు చేసే అధికారులు అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడం చేసిన యజమానికి నోటీసులు జారీ చేసి పార్కింగ్ కోసం సెల్లారు ఏర్పాటు చేసుకునే విధముగా చర్యలు తీసుకోవాలని స్థానికులు నగర కమీషనర్ పులి శ్రీనివాసులని కోరుతున్నారు.

## మేమున్నామని.. మీకేంకాదని..

**– ముగ్గురికి రూ. 9 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల మంజూరు**



**గుంటూరు జిల్లా నేటి దిన పత్రిక సూర్య బ్యూరో :**
పేదల గుండెకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోంది. చిన్న కష్టమొచ్చినా తానున్నానంటూ ఆపన్నహస్తం అందిస్తోంది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోంది. ఎమ్మెల్యే నసీర్ సోమవారం స్వయంగా సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారుల గృహాలకు వెళ్లి రూ. 9 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. పాత గుంటూరుకు చెందిన పుప్పుల సంజన, బాలాజీ నగర్ పదో లైనుకు చెందిన మల్లాది కాంతారావు, గౌడాస్ కాలనీకి చెందిన షేక్ మాబు చాన్ అనారోగ్యానికి గురి కావడంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకున్నారు. వీరికి వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు కావడంతో అప్పులు చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆయా కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వీరికి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే నసీర్ స్వయంగా లబ్ధిదారుల స్వగృహాలకు వెళ్లారు. పప్పుల సంజనకు రూ. 5 లక్షలు, మల్లాది కాంతారావుకు రూ. 2 లక్షలు, షేక్ మాబు చాన్ కు రూ. 2 లక్షలు చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ అపర సంజీవని అని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ కు కూడా కొర్రీలు పెట్టేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వైద్యానికి పెద్ద పీట వేశారని తెలిపారు. ఎవరికి ఆపద వచ్చినా తాము అండగా నిలుస్తామని, అనారోగ్యంతో ఏ ఒక్కరూ బాధ పడకూడదని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా ప్రగతి పథంలో పయనిస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమ కుటుంబాలను దేవుడిలా ఆదుకున్న సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు రుణపడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పఠాన్ జమీర్, డివిజన్ అధ్యక్షులు ఉస్మాన్, రియాజ్, EX డిప్యూటీ మేయర్ గౌస్,మజారుద్దీన్, రియాసిత్, మల్లికా, తుళ్లూరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండించిన డా. అశోక్ కుమార్

**పిడుగురాళ్ళ మేజర్ న్యూస్:**



అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే ఇటీవల చేసిన వ్యాఖ్యలు కేవలం అసభ్యకరమే కాకుండా, సమాజంలో ఉన్న ప్రతి తల్లిని అవమానించే స్థాయిలో ఉన్నాయి అని మండి పడ్డారు వైయస్ఆర్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డా" అశోక్ కుమార్ చింతలపూడి. ఒక రాజకీయ నేత స్థాయికి మించిన ఈ రకమైన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి, తెలుగు సంస్కృతికి మచ్చ తెస్తాయి అని అన్నారు. అంతే కాకుండా జూనియర్ ఎన్టీఆర్ తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత దూషణలు మాత్రమే కాదు – అవి తెలుగు సాంస్కృతిక విలువలకు తూట్లు పొడిచినట్టే అని అన్నారు. తల్లి అంటే ప్రతి మనిషికి ప్రాణం. తల్లిని అవమానించడం అంటే తల్లి గర్భాన్నే తిట్టినట్టే. ఎవరి తల్లిని అయినా రాజకీయ వేదికలపై అవమానించడం నాయకత్వం కాదు – బలహీనతకు నిదర్శనం. ఒకవేళ రాజకీయంగా జూనియర్ ఎన్టీఆర్‌ను ఎదుర్కోవాలనుకుంటే, ఆయనను నేరుగా ఎదుర్కొనాలి గాని ఆయన తల్లిని లాగడం అనేది అసహాయత, అశక్తత మాత్రమే. భువనేశ్వరి పై ఒకప్పుడు చేసిన దుష్ట వ్యాఖ్యలు ప్రజల మదిలో ఇంకా చెరగని మచ్చగా ఉన్నాయి. మన తెలుగు సంప్రదాయంలో, "తల్లిని గౌరవించని వాడు సమాజాన్ని గౌరవించలేడు" అని పేర్కొన్నారు. తల్లి పేరును అపకీర్తి పరచే నాయకుడు ప్రజల హృదయాలలో ఎప్పటికీ స్థానం పొందలేడు సమాజంలో ఏ మహిళనైనా గౌరవించలేని వారు ప్రజా పాలకులు ఎలా అవుతారు అని ఆయన మండి పడ్డారు.

## బిసిలకు 50శాతం రిజర్వేషన్ అమలుపరచాలి

**– బహుజన సమాజ్ పార్టీ**




**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :** గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద బిసిలకు 50 శాతం రిజర్వేషన్ విద్యా, ఉద్యోగ, రాజకీయ మరియు స్థానిక సంస్థల లో అమలు చేయాలి అని జరిగిన నిరసన కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర అధ్యక్షులు బందెలా గౌతమ్ అదేశానుసారం ఈరోజు పార్టీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలులో నిరసన కార్యక్రమం జరిగింది. ఇదే అంశం పై కలెక్టర్ కు మెమోరాండం అందజేయడమైనది. బిసిలకు తమ వాటా ప్రకారం జనాభా నిష్పత్తిన కేటాయించి వారికి రిజర్వేషన్ అమలు పరచాలని డిమాండ్ చేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరు బహుజన రాజ్యాధికార దిశగా పయనించవలసిన ఆవశ్యాకత ఎంతైనా ఉందని, బీసీలు మేల్కొని హక్కులు అమలు కు కృషి చేయవలసిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి బిసిలకు తను ఇచ్చిన హామీ అమలు చేయాలి అని డి మాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు, జిల్లా ఇంచార్జి జి.మాణి కుమారి, బి ఎస్ పి నాయకులు శృంగార పాటి బాబురావు, చీరతానగండ్ల వాసు సునీల్ దళిత ప్రజా సంఘాల నాయకులు భాగతసింగ్, జూపూడి శ్రీనివాసరావు, తన్నీరు సాంబయ్య, డేవిడ్ విలియమ్స్, ఎస్. వి సత్యనారాయణ,మతయ్య, ప్రకాష్, బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

– జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :** ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 86 ఫిర్యాదులు అందాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. నాదెండ్ల మండలం గిరిజవోలు గ్రామానికి చెందిన షేక్.రబ్బాని, వినుకొండ పట్టణానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దిన్, నరసరావుపేట కు చెందిన షేక్ మస్తాన్ భాష అను ముగ్గురు ఎంసీఏ పూర్తి చేసి జాబ్ కొరకు హైదరాబాదు వెళ్ళగా అక్కడ షేక్. జబ్బర్ అనే వ్యక్తి ద్వారా కాసరగడ్డ నరేంద్ర అను అతను పరిచయమై ఐటి జాబ్స్ ఇప్పిస్తానని అందుకు ప్రతిఫలంగా 4,00,000/- రూపాయలు చెల్లించమని,డబ్బులు చెల్లించిన అనంతరం రెండు మూడు నెలలలో ఐటి జాబ్స్ ఇప్పిస్తానని ఆరు నెలల వరకు ఇప్పించనట్లు, ఆరు నెలల అనంతరం ఉద్యోగాలు ఇప్పించనందున నాలుగు లక్షల రూపాయలు వెనకకు తిరిగి ఇస్తానని చెప్పి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు, డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నట్లు, మేము కేసు పెడతాము అని అంటే నేను కూడా మీ మీద కేసు పెడతాను అని బెదిరిస్తున్నందుకు గాను విచారణ జరిపి తగిన న్యాయం చేయవలసిందిగా ఎస్పీ ని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది క్రోసూరు మండలం గరికపాడు గ్రామానికి చెందిన గార్లపాటి అనురాధ అను ఆమెకు పెళ్లి అయిన ఒక సంవత్సరానికి భర్త చనిపోయినట్లు, ఆమెకు ఒక కుమారుడు సంతానం ఉన్నట్లు, అయితే ఆమెకు బంధువైనటువంటి సంగు.శ్రీనివాసరావు బృగబండ గ్రామం, సత్తెనపల్లి మండలం నకు చెందినటువంటి అతను వివాహం చేసుకుంటానని నమ్మబలికి కొన్ని రోజులు దాచేపల్లి గ్రామంలోని సంగు శ్రీనివాసరావు నివాసంలో సహజీవనం చేసినట్లు, కానీ అతను ఫిర్యాది ని పెళ్లి చేసుకోకుండా గరికపాడు గ్రామంలో వదిలిపెట్టి మోసం చేసినట్లు, అదేవిధంగా గాదేవారి పాలెం లో ఫిర్యాదు ని అడ్డుపెట్టుకొని తెలిసిన వారి వద్ద రెండు లక్షల రూపాయలు తీసుకొని మోసం చేసినందుకు గాను న్యాయం చేయవలసిందిగా ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది నరసరావుపేట యోగయ్య నగర్ కు చెందిన డ్వాక్రా సురక్ష మహిళ పొదుపు గ్రూపు నందు ఉన్న పదిమంది సభ్యులకు పది లక్షల రూపాయల లోన్ తీసుకున్నట్లు,గ్రూప్ లీడర్ అయిన జాన్ బి కి ఆరోగ్యం బాగా లేకపోవడం వలన సెకండ్ లీడర్ అయిన సుజాత కి ప్రతినెల తొమ్మిది మంది సభ్యులు కలిసి 23,400/- రూపాయలు చొప్పున 15 నెలల కు 3,51,000/- రూపాయలు చెల్లించినట్లు,కానీ రెండవ లీడర్ అయిన సుజాత తన సొంత ప్రయోజనాలకు వాడుకొని బ్యాంకులో జమ చేయనందున గ్రూప్ ఆర్.పి అయిన నూర్జహాన్ కు తెలియపరచగా ఆమె నుంచి ఎటువంటి సమాధానము రాలేదు. అంతట సుజాతను నిలదీయగా గ్రూపు సభ్యుల మీద కర్రలతో దాడి చేసినందుకు గాను న్యాయం చేయవలసిందిగా ఫిర్యాది ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు. అదే విధంగా దూర ప్రాంతాల నుండి వచ్చే అర్జీదారుల కొరకు భోజన ఏర్పాట్లు చేశారు ఈ పి జి ఆర్ ఎస్ నందు ఎస్పీ తో పాటు క్రైమ్ అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్పి వెంకటరమణ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌లో పది పిర్యాదులు



**తెనాలి, మేజర్ న్యూస్ :**

మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పది పిర్యాదులు అందినట్లు కమీషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ కు సంబంధించి నాలుగు, పబ్లిక్ హెల్త్ సెక్షన్ కు సంబంధించి మూడు, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు, ఇతర ఒక పిర్యాదు వచ్చినట్లు ఆయన తెలిపారు. పిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాలను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, ఏసీపీ వాణి, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, ఆర్వో రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

## వాలీబాల్ క్రీడలో జీ ఆర్ సి ఆర్ కే శ్రీ చైతన్య పాఠశాల ప్రతిభ

– అండర్15 వాలీబాల్ క్రీడలో రాష్ట్ర జట్టులో ఇద్దరికీ చోటు





**పెదకూరపాడు మేజర్ న్యూస్:** పెదకూరపాడు జీఆర్సీఆర్ కె శ్రీచైతన్య పాఠశాల క్రీడాకారులు వాలీబాల్ క్రీడలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో స్థానం పొందారు. విజయవాడ పడమట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ బాలుర, బాలికల అండర్–15 ఎంపిక పోటీల్లో 10వ తరగతి విద్యార్థులు సాధినేని నేహ, దూల్ల బ్రహ్మంలు మన రాష్ట్రం తరఫున ఈనెల 28న పూనేలో జరగనున్న నేషనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందారు. రాష్ట్ర జట్టులో స్థానం పొందిన క్రీడాకారులను పాఠశాల డైరెక్టర్ గుత్తి కవిత రాములు పాటశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. పూణేలో జరిగే నేషనల్ స్థాయిలో ప్రతిభ చాటాలని క్రీడాకారులకు సూచించారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో జిరాక్స్ మిషన్ అందజేత



**వినుకొండ మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎన్‌ఎస్పీ కాలనీలో గల జడ్పీ హెచ్ స్కూల్ నందు రోటరీ సభ్యులు గాండ్ల నాగేంద్రుడి సహకారంతో జిరాక్స్ మిషన్ ను ప్రింటర్ సౌకర్యార్థం ఈరోజు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రధానోపాధ్యాయులు సి హెచ్ వీరప్పయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది రోటరీ క్లబ్ అధ్యక్షులు వైవి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలకు మా రోటరీ క్లబ్ ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయటం జరుగుతుంది అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ పి స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు మంచినీటి కొరత ఉన్నందున మా రోటరీ క్లబ్ ద్వారా త్వరలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు ఈ సందర్భంగా స్కూల్ కి జిరాక్స్ ప్రింట్ అందజేసిన రిటైర్డ్ మాస్టర్ ను పలువురు అభినందించారు ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వైవి నారాయణ సెక్రెటరీ ఎస్.కె బాజీ మాజీ అధ్యక్షులు గుమ్మా శ్రీకాంత్ రెడ్డి జిల్లా క్యాబినెట్ సభ్యులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు ఆలా శ్రీనివాసరావు మాజీ సెక్రెటరీ గుత్తా గురునాథం క్లబ్ డైరెక్టర్ కూచి రామాంజనేయులు ఎన్ పద్మజ పి ఈ టి రాధాకృష్ణమూర్తి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనుల వేగం పెంచండి



**తెనాలి, మేజర్ న్యూస్ :**

అభివృద్ధి పనులని గుత్తేదారులు వేగవంతం చేయాలని మున్సిపాలిటీ ఇంచార్జి కమీషనర్ లక్ష్మీపతి రావు ఆదేశించారు. మున్సిపల్ కాంట్రాక్టర్లతో సోమవారం తన ఛాంబర్ లో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పనులు పూర్తి చేసినా నెలలు గడుస్తున్నా బిల్లులు రావడం లేదని గుత్తేదారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన కమీషనర్ పెండింగ్ బిల్లుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, డీ ఈ లు, ఏ ఈ లు పాల్గొన్నారు.ద

## మెగా కిసాన్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

**మేజర్ న్యూస్ వినుకొండ :**

వినుకొండ పట్టణంలోని మార్కెట్ యార్డులో జరగబోయే మెగా కిసాన్ మేళా ఏర్పాట్లను ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి వర్యులు కింజరాపు అచ్చన్నాయుడు , మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్ ,పల్నాడు జిల్లాలోని శాసనసభ్యులు అందరూ పాల్గొంటారని తెలిపారు.రైతులకు ఉపయోగపడేలా, వ్యవసాయ రంగంలో కొత్త సాంకేతికతలను పరిచయం చేసే లక్ష్యంతో ఈ కిసాన్ మేళాను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో రైతులు హాజరు కావాలని చీఫ్ విప్ జీవి గారు కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి కేరాఫ్ గుంటూరు

- నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణంలో రాజీ లేదు
- 8 నెలల్లో పూర్తి చేసేందుకు తీవ్రంగా కసరత్తు
- వర్షాకాలమైనా పనులు వేగవంతం
- బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :**

గుంటూరు నగరాన్ని అభివృద్ధికి కేరాఫ్ గా తీర్చిదిద్దుతున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు శరవేగంగా పరుగులు పెడుతున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. పాత గుంటూరులోని నందివెలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఇప్పటి వరకు పనులు ఎంత వరకు పూర్తయ్యాయి ? ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారు ? వర్షాకాలంలో పనులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి ? వంటి అంశాలను కాంట్రాక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టామని తెలిపారు. ఎనిమిది నెలల కాలంలో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పట్టుదలగా ఉన్నామని వెల్లడించారు. బ్రిడ్జి క్వాలిటీ విషయంలో కొంచెం కూడా రాజీ లేదని స్పష్టం చేశారు. బ్రిడ్జి నిర్మాణ సందర్భంగా వాహనదారులు ఈ ప్రాంత ప్రజలు పూర్తిగా సహకారం అందిస్తున్నారని చెప్పారు. అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లు నిర్మించారని, దీంతో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, దీంతో ప్రజలు అవస్థలు పడ్డారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.

## సత్తెనపల్లిలో ఏటీఎం కార్డు మోసం

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :**

పట్టణంలోని 15వ వార్డుకు చెందిన విశ్రాంత ఉద్యోగి వెల్లటూరి సుబ్బారావు సత్తెనపల్లి పాత బస్టాండ్ సమీపంలోని ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లారు. అక్కడే ఉన్న ఓ యువకుడు సాయం చేస్తానంటూ నమ్మబలికి ఆయన ఏటీఎం కార్డు మార్చి ఇచ్చాడు. అనంతరం వేర్వేరు ఏటీఎం కేంద్రాల నుంచి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 30 వేలు డ్రా చేశాడు. తన ఫోన్ కి వచ్చిన సందేశాలతో మోసపోయానని గ్రహించిన సుబ్బారావు సత్తెనపల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన బలసాని, అంబటి



**కాకుమాను, మేజర్ న్యూస్ :**
ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న పంట పొలాలను మాజీ మంత్రి అంబటి రాంబాబు, ప్రత్తిపాడు వైసీపీ ఇంచార్జి బలసాని కిరణ్ కుమార్‌లు పరిశీలించారు. సోమవారం ఉదయం కాకుమాను మండలంలో పర్యటించి, గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, దెబ్బతిన్న పంట పొలాలను మరియు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బారి వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల నష్టాన్ని అంచనా వేసి, రైతులకు తగిన నష్ట పరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని, ప్రభుత్వం వారికి అండగా నిలవాలని కోరారు.



## దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :**
పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్ నందు సమగ్ర శిక్ష వారి సాహితీ విద్య విభాగం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాల్లోని దివ్యాంగుల విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపారు. వ్యాధి నిర్ధారణ అనంతరం వీల్ చైర్స్ వాకింగ్ స్టిక్స్ శ్రావణ పరికరాలు అందించనున్నారు ఈ కార్యక్రమానికి జిల్లా ఐ ఈ డి కోఆర్డినేటర్ సెల్వ రాజు, మరియు మండల విద్యాధికారి ఏకుల ప్రసాదరావు, మండల టిడిపి అధ్యక్షులు వై బ్రహ్మయ్య, హైస్కూలు హెచ్‌ఎం కె.వి రమణ, మాజీ మండల అధ్యక్షులు గళ్ళా బాబురావు, మద్దినేని సత్యం మరియు హైస్కూలు సిబ్బంది వివిధ మండలాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబటిపై ఎస్పీకి డీసీఎంఎస్ ఛైర్మన్ ఫిర్యాదు





**గుంటూరు మేజర్ న్యూస్ :**
డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు పై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. పశ్చిమ బెంగాల్2023 సం. లో జరిగిన ఎన్నికల వీడియోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అంబటి రాంబాబు పోస్ట్ చేశారు. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ఓట్లు రిగ్గింగ్ చేశారంటూ అంబటి రాంబాబు ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల వీడియోలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించారు. స్వతంత్రం వచ్చిన తర్వాత పులివెందులలో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగాయి. ప్రజలు బుద్ధిచెప్పినా వైసీపీ జగన్మోహన్ రెడ్డి అండ్ బ్యాచ్ మారకపోవడం దారుణం. ఫేక్ వీడియోలు పెట్టి టీడీపీ పార్టీపై బురదజల్లడమే వైసీపీ నేతలు ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఎస్పీ సతీష్ కుమార్ తాము ఇచ్చిన ఫిర్యాదుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం హరిబాబు మీడియాతో మాట్లాడుతూ... గతంలో ఇలాగే చేస్తే ప్రజలు ఓటు అనే ఆయుధంతో చెంప చెళ్లు మనిపించారు, అయినా సిగ్గు ఎగ్గూ లేకుండా ఇంకా తప్పుడు ప్రచారం చేయాలని మీరు చూస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అండ్ బ్యాచ్ క్షుద్ర రాజకీయాలు మానుకోకపోతే పోతే రాబోయే రోజుల్లో శ్రీకృష్ణ జన్మస్థానం లో కూర్చోవడం అంబటి రాంబాబు కి తప్పదని హెచ్చరించారు.

# శ్మశాన వాటికలకు సరికొత్త రూపు

**-ఎనిమిది శ్మశానవాటికలను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేయించిన మంత్రి నారా లోకేష్**

**-మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో అభివృద్ధి పనులను ప్రారంభించిన స్థానిక నాయకులు**









**మంగళగిరి, మేజర్ న్యూస్ :**
మంగళగిరి నియోజకవర్గంలో ఒకప్పుడు చెట్లు, పుట్టల మధ్య దర్శనమిచ్చే శ్మశాన వాటికలు ఇప్పుడు కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. మంత్రి నారా లోకేష్ కృషితో నియోజకవర్గంలోని అన్ని సామాజికవర్గాల శ్మశాన వాటికల రూపురేఖలు మారుతున్నాయి. మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వడ్డేశ్వరం గ్రామంలో ఉన్న ఎనిమిది శ్మశాన వాటికలను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేయించారు. ఆ అభివృద్ధి పనులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో ఉన్న అన్ని శ్మశాన వాటికలకు చుట్టూర ప్రహరీ గోడలు లేకపోవడంతో పాటు ఇతర సమస్యను గ్రామస్తులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన త్వరితగతన సొంత నిధులతో అభివృద్ధి పనులను చేయించారు. ప్రత్యేక నిర్మాణాలతో కూడిన చితులు, వెయిటింగ్ హాళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు వంటి సదుపాయాలతో అభివృద్ధి పనులు చేయించారు. కేశ ఖండనం, దుస్తులు మార్చుకునేందుకూ గదులతో పాటు బూడిద నిల్వ సౌకర్యం వంటివి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనితో గ్రామస్తులు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వడ్డేశ్వరంలో గ్రామంలో హిందూ, ముస్లిం, మాదిగ, మాల, గౌడ, రజక, కన్వెర్టడ్, యాదవ-మరాఠి, సామాజికవర్గాల శ్మశాన వాటికలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అన్ని మతాలకు చెందిన శ్మశానవాటికలను మంత్రి నారా లోకేష్ దశల వారీగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చేస్తున్న అభివృద్ధి దేశంలోని ఏ నియోజకవర్గంలో కూడా చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈపూరి బాబు, నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు, ఎర్రగుంట్ల భాగ్య రావు, మల్లవరపు వెంకట్, షేక్ రియాజ్, వేమూరి మైనర్ బాబు, ఎండీ ఇబ్రహీం, కొల్లి శేషు, దాసరి కృష్ణ, కాంట్రాక్టర్ వెలగపూడి కిషోర్ బాబు, బొర్రా కృష్ణ వందన, షేక్ అక్రమ్, ఎస్.కె ఇబ్రహీం, యలమంచిలి పద్మజ, మద్దినేని సుబ్రహ్మణ్యం, జోరుగా దాసు, గుంపెన నాగేశ్వరరావు, షేక్ ఇమాంస, అంజుమన్, కమిటీ పెద్దలు, క్రిస్టియన్ పాస్టర్లు, గ్రామ పెద్దలు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## నూతన మద్యం పాలసీ

**పల్నాడు జిల్లాకు 54 బార్లు**

**ఎక్సైస్ సూపర్నెంట్ మణికంఠ**

**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని విడుదల చేసినట్లు పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపర్నెంట్ కే మణికంఠ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పల్నాడు జిల్లాకు ఓపెన్ క్యాటగిరి లో 49 బార్లు గీత కులాలకు ఐదుపారులు మొత్తం 54 బార్ లను కేటాయించినట్లు ఆయన తెలిపారు. నరసరావుపేట మున్సిపాలిటీకి సంబంధించి 17 బార్లు గీత కులాలకు మరొక బారు మొత్తం 18 కేటాయించినట్లు ఆయన తెలిపారు. బార్ల కేటాయింపు లాటరీ పద్ధతిలో ఉంటుందన్నారు. ఒక్కొక్క బార్కు 55లక్షల రూపాయలు ఆరు విడుత లగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫీజు 5 లక్షలు అన్నారు. అవి తిరిగి ఇవ్వబడమన్నారు. గీత కులాలకు కేటాయించిన బార్లకు ఫీజు 27.5 లక్షలు అన్నారు. దరఖాస్తులను ఆన్లైన్ ఆఫ్లైన్లో వర్కర్స్ చేసుకోవచ్చు అన్నారు. ఓపెన్ క్యాటగిరీలో ఈనెల 26వ తారీకు సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు ఫారాలను సమర్పించవలసి ఉంటుందన్నారు. 28వ తేదీ పల్నాడు జిల్లా కలెక్టరేట్లో బార్ల కేటాయింపుకు లాటరీ తీయబడుతుందన్నారు. గీత కులాలకు సంబంధించి ఈనెల 29 సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు సమర్పించవలసి ఉంటుందన్నారు. 30వ తారీకు పల్నాడు జిల్లా కలెక్టరేట్లో లాటరీ పద్ధతిలో వారికి బార్లు కేటాయించబడతాయన్నారు. గతంలో రెస్టారెంట్ ఉంటేనే బార్ షాప్ కు అనుమతి ఇచ్చే వారని ప్రస్తుతం ఆ కండిషన్ లేదన్నారు. రెండు గంటల పాటు అదనంగా బార్లను తెరిచి ఉంచే సమయం పెంచినట్లు తెలిపారు. గురజాల దాచేపల్లి నగర పంచాయతీలకు 35 లక్షల ఫీజు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. నరసరావుపేట మున్సిపాలిటీకి 18 చిలకలూరిపేట మున్సిపాలిటీకి 11 సత్తెనపల్లి మున్సిపాలిటీకి ఐదు పిడుగురాళ్ల మున్సిపాలిటీకి ఆరు మాచర్ల మున్సిపాలిటీకి ఐదు వినుకొండ మున్సిపాలిటీకి ఆరు గురజాల నగర పంచాయతీకి ఒకటి దాచేపల్లి నగర పంచాయతీకి రెండు బార్లను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రతి బార్కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీయబడుతుందన్నారు. దరఖాస్తుదారులు నగదును చలానా డిడి రూపంలో ఏ బ్యాంకు నుంచి అయినా తీసుకోవచ్చునారు. ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కూడా దరఖాస్తుల సమర్పించడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఎస్ రవీంద్ర, నరసరావుపేట సిఐ సోమయ్య లు పాల్గొన్నారు.

## దాసరి రాముకు నియోజకవర్గ కాపు సంఘ నేత కంకణాల శంకర్ పరామర్శ

**మంగళగిరి, మేజర్ న్యూస్ :**
కాపు, తెలగ, బలిజ సమాఖ్య జాయింట్ యాక్షన్ కమిటీ నిర్వాహకులు, సామాజిక, పర్యావరణ వేత్త దాసరి రామును నియోజకవర్గ కాపు సంఘ నేత కంకణాల శంకర్ పరామర్శించారు. నిరంతరం దైవ చింతన, సమాజ సేవలో గడిపే దాసరి రాము కుమార్తె శేషసాయి ప్రియాంక ఈనెల 12వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం నియోజకవర్గ కాపు సంఘ నేత కంకణాల శంకర్ గుంటూరు నగరంలోని దాసరి రాము నివాస గృహానికి చేరుకుని పరామర్శించారు. శేష సాయి ప్రియాంక చిన్న వయస్సులో అనారోగ్యంతో బాధపడుతూ అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాపు సంఘ నాయకులు చెన్నం వీరాంజనేయులు, బోనం రామారావు, నీలాద్రి వంశీ సాయి తదితరులు దాసరి రామును పరామర్శించిన వారిలో ఉన్నారు.



## పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు



**తెనాలి, మేజర్ న్యూస్ :**

పారిశుధ్య నిర్వహణలో తగు జాగ్రతలు తీసుకుని వ్యర్థాలు రోడ్లపై లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ కమీషనర్ లక్ష్మీపతిరావు ఆదేశించారు. పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంతంలో ఆయన సోమవారం పర్యటించారు. అక్కడి మురుగు కాల్వలను పరిశీలించారు. కాల్వలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. ఆ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట మున్సిపల్ ప్రజారోగ్య శాఖ అధికారి మొవ్వా ఏసుబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఉన్నారు.

## గ్రానైట్ ఫ్యాక్టరీలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విఫ్ జీవి

**మేజర్ న్యూస్ వినుకొండ :**

మార్టూరు మండలం, నాగరాజు పల్లి గ్రామంలోలి నూతనంగా ఏర్పాటు చేసిన హరి సహస్ర గ్రానైట్స్ మరియు శ్రీ ప్రసన్నాంజనేయ గ్రానైట్స్ ఫ్యాక్టరీలను ప్రభుత్వ చీఫ్ విప్ మరియు శాసనసభ్యులు శ్రీ జీవి ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. జీవి మాట్లాడుతూ, ఈ కొత్త గ్రానైట్ ఫ్యాక్టరీలు గ్రామంలో ఉపాధి అవకాశాలను పెంచుతాయని, స్థానిక యువతకు ప్రయోజనం చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తివేత

?



**మాచర్ల మేజర్ న్యూస్ :**

భారీ వర్షాల నేపథ్యంలో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ కు కృష్ణా నది వరద నీరు భారీగా వచ్చి చేరడంతో సోమవారం అధికారులు మొత్తం 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. నాగార్జునసాగర్ డ్యాం సుందరమైన దృశ్యాన్ని వీక్షించడానికి ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.90 అడుగులు మేర నీరు వచ్చి చేరింది.

## రాజధాని అమరావతిలో మూడు రిజర్వాయర్ల నిర్మాణం

**– వరదకు అడ్డుకట్ట!**

**గుంటూరు, మేజర్ న్యూస్ :**

భారీ వర్షాలకు ఏపీ రాజధాని అమరావతి ప్రాంతం జలమయం కావడం ప్రధాన సమస్యగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారం కోసం నీరుకొండ (0.4 టీఎంసీ), కృష్ణాయపాలెం (0.1 టీఎంసీ), శాఖమూరు (0.01 టీఎంసీ)లతో మూడు రిజర్వాయర్లను రూ. 1200–1500 కోట్లతో నిర్మిస్తున్నారు. 8 కి.మీ. గ్రావిటీ కెనాల్తో పాటు 48.3 కి.మీ. కాలువల వెడల్పు, పూడికతీత పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే అమరావతిలో నీరు నిలబడదని అధికారులు చెబుతున్నారు.

# బైక్ తాళం వేయలేదా... అయితే బండి మాయమే!

**– ఇటీవలే 9 మంది అరెస్టు**
**– నిందితుల్లో ముగ్గురు మైనర్లు**
**– 34 వాహనాలు స్వాధీనం**



**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్ :**

తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపాడు లక్ష్మణ్. వెంటనే వెళ్ళిపోదాంలే అని నిర్లక్ష్యంతో తాళం వేయటం మర్చిపోయాడు. అలాగే ఇంట్లో ఉండిపోయాడు. మరుసటి రోజు ఉదయం ఇంటి బయటకు వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల బైక్ పోగొట్టుకున్నాడు. ద్విచక్రవాహనాలను ఎక్కడబడితే అక్కడ వదిలేసి వెళ్తున్నారా? అయితే అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది. మీరు చేసే చిన్న తప్పిదమే కేటుగాళ్లకు అవకాశంగా మారుతుంది. ఇళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమాహాళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ సమగ్రాసుపత్రి, రైతుబజార్, ఇలా ఎక్కడ వాహనం నిలిపినా క్షణాల్లో మాయం చేసే దొంగలు మన మధ్యలోనే తిరుగుతున్నారు. చెడు స్నేహాలతో జల్సాలకు అలవాటుపడి డబ్బులు కోసం మైనర్లే ఈ దొంగతనాలు చేస్తున్నట్లుగా పోలీసుల నిఘాలో వెల్లడైంది. జల్సాలకు అలవాటుపడి రాత్రివేళల్లో ఇళ్ల ముందున్న వాహనాలను వీరు అపహరించుకుపోతున్నారు. తరచూ ఫిర్యాదులు వస్తుండడంతో ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇటీవల తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 34 వాహనాలను జప్తు చేశారు. నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నారు. ఎక్కువ వాహనాలను చోరీ చేసింది కూడా వీళ్లే కావడం గమనార్హం.

**గంజాయి కోసం :** కొంతమంది గంజాయి అక్రమ రవాణాకు ద్విచక్రవాహనాలను ఉపయోగిస్తున్నారు. సొంత బైక్లపై వెళితే పోలీసులకు దొరికితే ఇబ్బందని, చోరీ చేస్తున్నారు. వీటిని గంజాయి కొనుగోళ్లు, అమ్మకాలకు వినియోగిస్తున్నారు.

**సులువుగా దొంగల పని :** పాత అరిగిపోయిన తాళాలు, మారు తాళాలు వినియోగించి వాహనం హ్యాండిల్ గట్టిగా అటూ, ఇటూ తిప్పి చోరీలు చేస్తున్నట్లు నిందితులు తెలిపారు. అందులోని కరెంటు తీగలను కలిపి స్టార్ట్ చేస్తున్నట్లు పోలీసులకు వివరించారు. ఇటీవల పోలీసులు పట్టుకున్న 34 వాహనాల్లో 11 బైక్లకు తాళమే వేయలేదని వాటిని చోరీ చేసినట్లు వారు వెల్లడించడం గమనార్హం. మరికొంతమంది తాళం వేసినా వాటికే ఉంచి మరచిపోతున్నార న్నారు. గతంలో తాళాలు బైక్కే ఉన్న వాహనాలను కొందరు ముఠా సభ్యులు చోరీ చేశారు.

**యజమానుల అజాగ్రత్త వల్లే :** ద్విచక్ర వాహనాలకు తాళాలు వేయకపోయినా, వాటిని వాహనాలకే ఉంచినా నేరగాళ్లు సులువుగా దొంగతనం చేస్తున్నారు. ఇంటి బయట, రోడ్లపై కాకుండా లోపల వాహనాలను ఉంచడం మంచిది. ఒకవేళ బయటే నిలపాల్సి వస్తే వీల్లాక్ లేదా జీపీఎస్ తప్పనిసరిగా అమర్చుకోవాలి. నాణ్యతను బట్టి రూ.300 మొదలుకుని మార్కెట్లో దొరుకుతున్నాయి. జీపీఎస్ ఉన్న వాహనం చోరీకి గురైతే గంటల వ్యవధిలో గుర్తించొచ్చు అని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.

## ఎత్తిపోతల గిరిజన సంక్షేమ వసతిగృహం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ





**నరసరావు పేట మేజర్ న్యూస్ :** సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు, ఎస్పీ కంచిశ్రీనివసరావు లు మాచర్ల నియోజకవర్గం, ఎత్తిపోతల గిరిజన బాలికల సంక్షేమ వసతిగృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలో బాలికల భద్రత అత్యంత ప్రాధాన్యత అంశమని స్పష్టం చేశారు. బాలికలకు భరోసాగా ఉండేలా వసతి గృహం నలువైపులా వెలుతురు ఉండేలా చూసుకోవాలని, సీసీ కెమెరాలు నిర్వహించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. రాత్రివేళల్లో వార్డెన్లు తప్పనిసరిగా వసతి గృహంలోనే ఉండాలన్నారు. బయటి వారిని ఎట్టి పరిస్థితుల్లో వసతిగృహంలోకి రానివ్వకూడదన్నారు. హాస్టల్ లో కోతుల బెడద గురించి విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నివారణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో మురలీకృష్ణ, తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

## గాంధీ నడయాడిన పాఠశాలలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

**– రెంటచింతల వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల సందర్శన**



**నరసరావు పేట మేజర్ న్యూస్ :** స్వయానా మహాత్మా గాంధీ శంఖు స్థాపన చేసిన రెంటచింతల వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలను సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు సందర్శించారు. పాఠశాలలోని మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో గంటసేపు ముచ్చటించారు. ప్రతీ విద్యార్థితో వ్యక్తిగతంగా మాట్లాడి సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగారు. గణితం, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులలో విద్యార్థులను మరింత మెరుగుపరచాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. హాస్టల్ వార్డెన్లు విద్యార్థుల హోం వర్కులు తప్పని సరిగా చేసేలా చూడాలన్నారు. ఘన చరిత్ర ఉన్న వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలను మరోసారి తప్పకుండా సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థాయిలను పరీక్షిస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీ కృష్ణ, ఎంఈవో , పాఠశాల హెడ్ మాస్టర్ కె. చంద్ర శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు. 1929, ఏప్రిల్ 21న లాలా లజపతి రాయ్ పేరు మీదుగా రెంటచింతల ప్రాథమిక పాఠశాలకు మహాత్మాగాంధీ శంఖు స్థాపన చేశారు. అనంతరం 1960 ల్లో ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ అయిన సమయంలో, పాఠశాల నిర్మాణానికి ఆర్థిక సాయం చేసిన రంగనాయకులు శ్రేష్టి పేరు మీదుగా వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందారన్నారు కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## పాతకొల్లిమర్ల వాగు వద్ద కోతకు గురైన రోడ్డు

**– బాబు చేయాలని కోరుతున్న ప్రజానీకం**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు గ్రామం నుండి కాకుమాను మండలంలోని పాతకొల్లిమర్ల గ్రామం వరకు పంచాయతి రాజ్ నిధులతో సుమారు ఆరు కిలో మీటర్లు వరకు నూతనంగా తారు రోడ్డును నిర్మించటం జరిగింది. అయితే పాత కొల్లిమర్ల గ్రామం వద్ద గల నక్కవాగు వంతేన మూల తిరుగు ప్రదేశంలో వాగు వెంబడి ఉన్న తారు రోడ్డు చాలా వరకు కోతకు గురి అగుట వలన భారీ వాహనాలు ముట్లూరు, చేబ్రోలు వైపునకు రాకపోకలు కొనసాగించుటకు వీలుపడుట లేదు. ఇదే విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళటం జరిగింది స్పదించిన అధికారులు రెండు నెలల క్రితం ఈ వంతేన మూల వద్దరోడ్డు కోతకు గురైన మలుపు ప్రాంతంలో కర్రలు బాధి మట్టి తోలి కోత ప్రాంతాన్ని పూడ్చి నారు. అయితే ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు పూర్తి గా రోడ్డు కోతకు గురి అయినది పూడ్చిన మట్టితోపాటు మరింత గా రోడ్డు కోతకు గురి అయి వంతేన రెండవ వైపు కుడా రోడ్డు పగుళ్ళు ఇచ్చినది. వంతేన మలుపు వద్ద కాంక్రీట్ తో గోడ కట్టాల్చిన అధికారులు తూతు మంత్రంగా గుంజలు పాది మట్టి పోయటం పట్ల ప్రజలు అధికారుల తీరును విమర్శిస్తున్నారు గుంజలు పాతటం వలన ఉపయోగం లేదని తెలసినా అధికారులు ప్రజాధనం వృధా చెయ్యటం వలన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతేన వద్ద మలుపు ప్రాంతాన్ని భారీ వాహనాలు తిరిగే విధంగా వెంటనే సరి చెయ్యాలని ఫలితంగా చేబ్రోలు, తెనాలి వైపు నుండి కాకుమాను, పెదనండిపాడుల వైపు అతి తక్కువ దూరం తో ప్రయాణం చేయుటకు వీళగుతుందని రోడ్డు వేసినందు ఫలితం దక్కుతుందని వాహనాలు తిరగ కుండా రోడ్డు వేస్తే ఉపయోగం ఏమిటని అధికారులను ప్రజలు ని లదీస్తున్నారు కాబట్టి ఇంతటి ప్రాముఖ్యత కల రోడ్డు మార్గంను అధికారులు ఒకసారి పరిశీలించి ఈ రోడ్డు పై భారీ వాహనాలు తిరిగేం దుకు ఇబ్బందులు లేకుండా చూడాలని కొల్లిమర్ల, కొండబాలవారిపాళెం, చినలింగాయపాళెం, బికె. పాళెం తదితర గ్రామాల ప్రజలు అధికారులను కోరుచున్నారు.